
# ఇంగువ

-పెద్దిభొట్ల సుబ్బరామయ్య

రిక్షా దిగుతూ ఉండగా ఎదురొచ్చాడు రాముడు. ఆందోళనగా 'ఎట్లా ఉందిరా నాన్నకు'' అని అడిగాను. వాడు నా చేతిలోని సంచీ అందుకుంటూ నాతోపాటే లోపలికి నడుస్తూ ''అట్లాగే ఉంది. ఏమీ మార్పు లేదు'' అన్నాడు.

''అట్లాగే అంటే అసలు డాక్టరు ఏమంటాడు''

''ఏమంటాడు మహా అయితే వారం రోజులన్నాడు. ఆ మాట చెప్పి కూడా నాలుగు రోజులయింది. అయిన వాళ్ళం దరికీ కబురు పెట్టమన్నాడు. ఈ లోపల వొచ్చే తెలివీ, పొయ్యే తెలివీ, కాస్సేపు కళ్ళు తెరిచి చూసి ఏదో అంటాడు. అదేమిటో వినిపించి చావదు. అదేమిటో మనం అర్థం చేసుకునే లోపల మళ్ళీ మగతలోకి వెళ్ళిపోతాడు.''



''కానివ్వు... మన చేతుల్లో ఏముంది గనక'' అంటూ ముందు గదిలోకి వెళ్ళాను.

రాముడి భార్య చెంబుతో నీళ్ళు తెచ్చిపెట్టి 'కాళ్ళు కడుక్కోండి' అన్నది.

నేను లేచి సంచిలో నుంచి టవలు తీసుకుని పంచ చివరికి వచ్చి కాళ్ళు కడుక్కుని తుడుచుకుని వెళ్ళేసరికి చల్లని శుభ్రమైన నీళ్ళున్నాయి టీపాయి మీద. గటగట త్రాగితే ప్రాణం లేచి వచ్చింది.

''ఊ! అయితే రోజుల్లోకి వచ్చిందన్న మాట...!'' అన్నాను.

''అంతే... అంతే...'' అన్నాడు రాముడు దిగులుగా.

''నువ్వు ధైర్యంగా ఉండు. మన చేతుల్లో ఏమున్నది గనక.'' అన్నాను మళ్ళీ నేను. ''ఇంతలో తాతగారు కళ్ళు తెరిచి చూస్తున్నారు'' అంటూ వెళ్ళిందొక అమ్మాయి.

రాముడూ, వాడి వెంట నేనూ హడావిడిగా లోపలికి వెళ్ళాము.

కుడి వైపు గది చిన్నదే. కిటికీ పక్కన నవ్వారు మంచం. మంచంలో రాజశేఖరం. బాగా చిక్కిపోయి ఎముకల గూడులాగా అయిపోయాడు. గడ్డం మాసి వుంది. ఇప్పుడు మాత్రం వెల్లకిలా పడుకుని కళ్ళు పెద్దవి చేసి పైకి చూస్తున్నాడు.

రాముడు వెళ్ళి పక్కనే కూర్చుని ''నాన్నా చూడు ఎవరొచ్చారో...'' అన్నాడు పెద్దగా. రాజశేఖరం ముఖం తిప్పి చూశాడు. కొన్ని క్షణాలు నిశ్చలంగ చూసిన తర్వాత కళ్ళలో మెరుపు వచ్చింది. ఏదో అన్నాడు కాని వినిపించలేదు

నా కళ్ళు చెమర్చాయి. బాగా దగ్గరగా వెళ్ళి చెయ్యి వేసి నిలబడ్డాను.

రాజశేఖరం చెయ్యి కొంచెం పైకె 'కూర్చో' అని కాబోలు అన్నాడు.

నేను పక్కనే కూర్చున్నాను.

అంతలో అతనికి దగ్గు తెర వచ్చింది కొద్ది క్షణాలు దగ్గులో ఉక్కిరి బిక్కిరి అయ నాడు. తర్వాత తేరుకుని నన్ను దగ్గరగ రమ్మని మళ్ళీ సైగ చేశాడు. నేను అత గుండెల మీద వంగి కూర్చున్నాను.

అతి ప్రయత్నం మీద నోరు తెరిచి ఏద అంటున్నాడు. ధ్వని మాత్రం బయటి రావడం లేదు. నేను అతని నోటి దగ్గరగా చె ఉంచి వినడానికి ప్రయత్నిం చాను. చివ కెలాగో ఓపిక తెచ్చుకుని నాకు వినబడేట్ల అన్నాడు.

''ఇంగువ ఏమిటి''

''అంటే'' అన్నాను నేను.

''అదే... ఇంగువ ఏమిటి'' అన్నాడ మళ్ళీ.

ఆ మరుక్షణంలో మగతలోకి జారిపోయాడు. అతని కళ్ళు మూతల పడ్డాయి.

నాకు మతి చెడినంత పని అయింది. లేచి ఇవతలికి వచ్చాను.

ముందు హాల్లో కాస్సేపు కళ్ళు మూసుకుని కూర్చున్నాను.

'ఏమిటీ చిత్రం' ఇతనికీ అనుమానం ఇంకా తీరనే లేదా ఇన్నాళ్ళు ఇన్నేళ ఈ చిన్న విషయం తెలుసుకోలేకపోయాడా అనిపించింది.

ఎప్పటి సంగతి

దాదాపు పదిహేనేళ్ళ క్రిందటి సంగతి.

మేమిద్దరమూ కలిసి చదువుకున్న వాళ్లం. కలిసి తిరిగే వాళ్లం. మమ్మల్ని చూసి అప్పట్లో కొందరు 'రాము-సోము' అనీ, మరికొందరు 'కరటక దమనకు'లనీ అనే వాళ్ళు. మా స్నేహం అంత దృఢంగా ఉండేది. ఒకర్ని ఒకరం చూడక ఉండలేకపోయే వాళ్ళం. చదువులు పూర్తయిన తర్వాత అతనికి రెవిన్యూ డిపార్టుమెంటులో ఉద్యోగం వచ్చి ఎటో పోయాడు. నేను బడి పంతులుగా స్థిరపడి పోయాను. అన్నీ తెలుస్తూనే వున్నా, రాకపోకలు సాగుతూనే ఉన్నా ముఖావలోకనాలు మాత్రం సహజంగానే తగ్గిపోయాయి. కలయిక సకృత్తు అయింది.

దాదాపు పదిహేనేళ్ళ క్రిందట ఒకసారి మేమిద్దరం వాడి కొడుకు పెళ్ళిలోనో, మా అమ్మాయి పెళ్లిలోనో కలుసుకున్నప్పుడు జరిగింది. పెళ్లి హడావిడి అయిన మరునాడు బంధు జనం అంతా మూణ్ణిద్రలకు తరలిపోగా కాస్త ప్రశాంతత చిక్కగానే ఊరి బయటికి షికారుకి బయల్దేరి చాలా దూరం నడిచి పోయాము. ఎన్నో విషయాలు చర్చకు వచ్చాయి. ఎంతో మాట్లాడుకున్నాము. ఏవేవో గుర్తు చేసుకున్నాము. అతడు ఉన్నట్టుండి 'మన జీవితంలో చాలా విషయాలు తెలుసుకోకుండానే వెళ్ళిపోతాం...!' అన్నాడు.

'అంటే!' అన్నాను నేను.

'అంటేనా ఇప్పుడు ఉదాహరణకు నువ్వు రోడ్డు మీద పోతూ ఉంటావు. అవతల దూరంగా వెళ్తున్న ఎవరినో చూడాలనుకుంటావు.. కాని ఏ లారీయో, ట్రక్కో అడ్డం వస్తుంది. అంతే... అవతలి మనిషిని ఎప్పటికీ చూడలేవు. అలాగే ఒకప్పుడు ఏదో అనుమానం వస్తుంది. అది తీరకుండానే ఉండి పోతుంది. ఆ అనుమానం తీర్చుకుందామనే అనుకుంటూ ఉంటాము. కాని వీలుపడదు. ఎప్పటికీ వీలు పడదు. ఏదో చూడాలని అనుకుంటాము. కాని చూడడం ఎప్పటికీ కుదరదు. అలానే కాలం అంతా గడిచిపోతుంది. చివరకు అట్లాగే చచ్చి పోతాము...!'

''ఇదేమి ధోరణి... వెర్రి ధోరణి'' అన్నాను నేను ఆ వాగుడు భరించలేక.

''కాదు... కాదు... విను సీరియస్‌గా ఆలోచించు...'' అన్నాడు మళ్ళీ.

''అది మామూలే అందరికీ... ఏ మానవుడికీ అన్నీ తెలియవు.'' అన్నాను.

అతడు మళ్ళీ ''అన్నీ అక్కర్లేదు. కొన్ని చిన్న చిన్న విషయాలే తెలియవు. ఉదాహరణకు నాకు ఇంగువ అంటే ఏమిటో తెలియదు. చిన్నప్పటి నుంచీ ఈ ప్రశ్న అలాగే ఉండిపోయిందిప్పటి వరకూ... ఎప్పుడూ చూస్తున్నదే కదా! తింటున్నదే కదా! అదేమిటో ఇప్పటికీ తెలియదు నాకు'' అన్నాడు.

''అంటే''

'అంటేనా అది ఏ పదార్థం చెట్టు నుంచి వొస్తుందా! ఏదయినా రసాయనిక పదార్థమా లేక ఒక రకం రాయి వంటిదా అదీ గాక ఏదన్నా జంతువుకు సంబంధించినదా''

''నాకు తెలియదు'' అన్నాను నేను.

''ఎన్నో సార్లు తెలుసుకోవాలనుకున్నాను. అదేమి చిత్రమో. ఎప్పుడూ వీలు పడలేదు. ఒకసారి ఒక గొప్ప ఫిజిసిస్టు కలిశాడు రైల్లో, చాలాసేపు చాలా విషయాలు మాట్లాడుకున్నాం కూడా. కాని చివరకు ఈ విషయం అడుగుదామనుకుంటూ ఉండగా రైలు ఆగడం, ఆయన హడావిడిగా దిగిపోవడం జరిగాయి. మా అబ్బాయిని ఒకసారి గుర్తొచ్చి అడిగితే వారు వింతగా చూశారు తప్ప ఏమీ చెప్పలేదు. మరోసారి ఎవరినో అడిగితే కనుక్కుని చెబుతామన్నారు కాని తర్వాత కనిపించి నేనడిగినది ఏమిటో తమకు గుర్తులేదన్నారు. ఇలా అయింది తప్ప నా అనుమానం తీరనేలేదు.''

''తీరుతుందిలే. అదేమీ మహా విషయమా, తీరకపోవడానికి ఎవరినడిగినా చెబుతారు'' అన్నాను నేను. కాని తర్వాత ఆ విషయమే మరిచిపోయాను. వాడు వేరే ధోరణిలో పడ్డాడు.

అప్పటికి జరిగింది అంతే.

ఇంతకాలం గడిచాక ఇప్పుడు అతడు చావుబ్రతుకుల్లో ఉన్నాడని కబురందుకుని ఆదుర్దాగా బయల్దేరి వస్తే, నా చెవి దగ్గర అతడు మహా శ్రమ పడుతూ వేసిన ప్రశ్న 'ఇంగువ ఏమిటి' అని.

## గుప్పెడు మనసు


రౌజమహలు, గోవత్సం, పాలవల్లె పద్య కృతుల ద్వారా, అనేక చారిత్రాత్మక నాటకాల ద్వారా పేరుగాంచిన పువ్వాడ శేషగిరిరావు గారి చిన్ననాటి సంఘటన వారి ప్రతిభను చాటడమే గాక మన మనసులను కదిలిస్తుంది.

విజయవాడ ఎస్.కె.పి.వి.వి. హైస్కూలులో టీచరుగా పనిచేస్తున్న ఇరవై ఏళ్ళ శేషగిరిరావు క్లాసులో పాఠం చెబుతుండగా అప్పటి జిల్లా విద్యా శాఖాధికారి పేరయ్య శాస్త్రి గారు తరగతికి వచ్చారు.

అప్పుడు ''గుప్పెడటుకుల్ కొనియాడె భాస్కరా'' అనే పద్యం చెప్పి దాని భావాన్ని వివరిస్తున్నారు విద్యార్థులకు శేషగిరిరావుగారు. గుప్పిలి మూసి విద్యార్థులకు చూపి ''మీ సైన్సు పుస్తకాలలో వుంటుంది- యిదే ఆకారంలో ఒక బొమ్మ. దానిని మీరేమని పిలుస్తారు.'' అని అడిగారు.

''గుండెకాయ'' అన్నారు ముక్త కంఠంతో.

అప్పుడు పువ్వాడ వారు మళ్ళీ అందుకుని కుచేలుడు కృష్ణునికి తన హృదయాన్నే సమర్పించాడని పై పద్యం భావమని వివరించారు. ఇది వింటూ నిలబడిన పేరయ్య శాస్త్రి గారు ముగ్ధులై పువ్వాడ వారిని ఆలింగనం చేసుకుని అభినందించారు.





సుసర్ల అధ్యాయం

సలక్షణమైన రాగాలతో, విలక్షణమైన ప్రయోగాలతో చక్కని బాణీలు కట్టిన ఘనత సుసర్ల దక్షిణామూర్తి గారికి దక్కుతుంది. సంసారం సంసారం, నిదురపోరా తమ్ముడా, చల్లని రాజా ఓ చంద మామ వగైరా హిట్ సాంగ్స్ అన్నిటికీ వరసలు కట్టినది సుసర్ల వారే. ఒకసారి ఆయన రైలులో ప్రయాణం చేస్తున్నారు. కంపార్టుమెంటు చాలా రద్దీగా వుంది. ఆ బోగీలోకి ఓ యాచక గాయకుడు వచ్చి ''సంసారం సంసారం ప్రేమ సుధా పూరం'' అని అందుకున్నాడు. అంతటి రద్దీలో కూడా అందరూ ఆ పాటని మైమరచి వినసాగారు. ఆ పాట పూర్తయ్యే సరికి చాలా చిల్లర అతనికి వచ్చింది. తర్వాత ఓ ఆసామి ఆ పాటని, దాని బాణీని బాహాటంగా మెచ్చుకోవడం ఆరంభించాడు. సుసర్ల వారు ఉప్పొంగిపోయి ''దానికి సంగీత భర్తని నేనే'' అని చెప్పారు. ఆ బిచ్చగాడు ఇదేమీ పట్టించుకోకుండా సుసర్ల వారి దగ్గర కూడా చెయ్యి జాపాడు. పక్కన వున్న ఆసామి వెంటనే ''ఒరేయ్ నువ్విప్పుడు సంపాదించిందంతా ఆయన చలవేరా! ఇంకా ఆయనను అడుగుతావేం'' అని అన్నారట. ఆ బిచ్చగాడు విషయం అర్థం చేసుకుని సుసర్ల వారికి పాదాభివందనం చేసి ''మీ పాటలతో రోజూ పది రూపాయలు సంపాదించుకుంటున్నాం బాబూ! మీరు చల్లగా వుండాలి'' అన్నాడు. దక్షిణామూర్తి గారు దీనిని తన జీవితంలో గొప్ప సన్మానంగా భావించారు. ఆయన కూడా ఓ పది రూపాయలు తీసి ఆ బిచ్చగాడి చేతిలో పెట్టారు.

నేను లేచి స్నానం చేసి నాలుగు మెతుకులు కతికి మంచం మీద నడుం వాల్చానే కాని మనసు కుదుట పడలేదు.

పక్కన వారూ, వీరూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. కబురందుకుని కొందరు వచ్చినట్టున్నారు.

''ఎవరో ఒకరు ప్రతి నిముషం విడవకుండా దగ్గర కూర్చుంటూ ఉండండి'' అంటున్నాడొకాయన.

''ముందుగానే పంచలోకి చేర్చి పక్కగా పడుకోబెడితే మంచిదేమో అసలే మంచి రోజులు కావు!'' అన్నారు మరొకరు.

నాకు మనుస్సు చివుక్కుమన్నది. రాజశేఖరం కష్టార్జితం ధారపోసి ఎంతో ముచ్చటపడి కట్టుకున్న ఇల్లు- అతణ్ణి ఈ సమయంలో బైట పడేస్తారా

''తొందరపడొద్దు. జాగ్రత్తగా చూస్తూ వుంటే లక్షణం తెలుస్తుంది. గురక వంటి దొస్తుంది.

చెవుల కింద తమ్మెలు వెనక్కు వంగిపోతాయి. ఒక్కొక్కప్పుడు ఉన్నట్టుండి అదిరి పడటం, వణకడం వుంటాయి. శ్వాసలో మార్పు వస్తుంది. తల ఎగరేయడం వంటి ఏ లక్షణం కనిపించినా వెంటనే పంచలోకి పట్టేయడమే...'' అంటున్నారొకరు.

నేనిక కూర్చోలేక పోయాను. లోపలికి వెళ్ళి చూస్తే రాజశేఖరానికి అంతకు పది నిముషాల ముందే తెలివి వచ్చిందనీ, మళ్ళీ మరు నిముషంలో మగత కమ్మిందనీ చెప్పింది కోడలు.

నేను ఇవతలికి వచ్చి ఎవరో ఇచ్చిన కాఫీ తాగి ఇంట్లో నుంచి బయట పడ్డాను.

చిన్నప్పుడు మేముండిన పేట... ఆ పరిసరాలు బాగా మారిపోయాయి.

ఇక్కడ ఒక చిన్న సర్కారు బడి ఉండాలి. ఇప్పుడక్కడ ఒక భవనం వెలసింది. పైన ఒక పెద్ద పార్కు ఉండేది. చిన్నా పెద్దా చెట్లతో అక్కడే రకరకాల ఆటలాడుకుంటూ ఉండేవాళ్లం. ఇప్పుడది మునిసిపల్ మార్కెట్ కాంప్లెక్స్ అయింది. అప్పుడు అది అత్యంత ఆధునిక భవనం. ఇప్పుడు పాతబడి పోయి కాలం పూసిన మసి పూతలతో శోభా విహీనమై ఉంది. ఏదో చవకబారు హోటలు ఉంది. ఇప్పుడందులో ఊరంతా వెర్రి వాడి ఆలోచనల్లాగ అడ్డదిడ్డంగా పెరిగిపోయింది.


రోడ్లన్నీ జనమయం. వచ్చే బళ్ళూ, పోయే బళ్ళూ... వాహనాలు... వాటి రొద... అంతా బీభత్సంగా ఉంది. అప్పట్లో కొత్తగా కట్టిన సినిమా హాలు ఇప్పుడు రెండు పెద్ద థియేటర్ల మధ్య 'ఉద్ధతుల మధ్య పేదల కుండ తరమె' అన్నట్టు చిక్కి ఏదో పాత సినిమా ఆడుతూ, దయనీయంగా ఉంది. ఇక్కడన్నీ చెట్లుండేవీ అప్పుడు. ఇప్పుడు ఒక్కటీ లేదు. అప్పటి అణా కాఫీ ఇప్పుడు నాలుగు రూపాయలై పోయింది.

నడుస్తూ ఉండగా నాకు రామేశం గుర్తు వచ్చాడు. కాలేజీ లెక్చరర్... సీనియర్ బాగా...

వాళ్ల ఇల్లు వెదుక్కుంటూ బయలుదేరాను. పోగా పోగా దొరికింది అది. గేటు తీసుకుని లోపలికి వెళ్లి పంచలో నిలబడి కాలింగ్ బెల్ నొక్కాను. కుక్క ఒకటి భీకరంగా ముందుకు రాబోయింది.

'టైగర్!' అని అరుస్తూ వొచ్చిందొకావిడ. సన్నగా ఎర్రగా ఉంది. 'ఎవర'న్నట్టు చూసింది.

నా గురించి నేను చెప్పుకుని 'రామేశం ఉన్నాడా' అని అడిగాను ఏక వచన ప్రయోగంతో. ఆవిడ ఏమనుకున్నదో ఏమో, 'లోపలికి రండి' అన్నది.



## వేలూరి సుందరి

ప్రాచ్య పాశ్చాత్య సారస్వతాలు, శాస్త్రాలు ఆమూలాగ్రంగా ఆకళింపుకున్న వేలూరి శివరామ శాస్త్రిగారు శతావధాని కూడా. వారిది నిండైన విగ్రహం, పండు తమలపాకు వంటి శరీరచ్ఛాయ. దానికి తోడు మల్లెపూవు లాంటి దుస్తులతో ఎంతో ఆకర్షణీయంగా వుండే వారు. ఆయన మంచి వయస్సులో వుండగా ఒకసారి రవీంద్రుని, శరత్‌బాబుని కలుసుకోవడానికి కలకత్తా వెళ్ళారట. ఒకరోజు ట్రామ్ బండిలో వెళ్తూ చలివేస్తుంటే భుజం మీది ఉత్తరీయం తీసి మేలి ముసుగుగా కప్పుకుని కూర్చున్నారు. మధ్యలో ట్రాములో కెక్కిన కొంతమంది విద్యార్థులు ఆయనను చూసి సుందరాంగి అనుకుని ఓర చూపులు, గొంతు సవరింపులు, ఇకఇకలు-పకపకలూ ప్రారంభించారట. శాస్త్రిగారు ముసిముసి నవ్వులతో వాళ్ళ అల్లరి భరించారు. తీరా దిగవలసిన చోటు రాగానే లేచి నిలబడి ఉత్తరీయం సర్దుకుని ఆకతాయి కుర్రాళ్ళను ఒక నవ్వుతోనే పలకరించి దిగారట. వాళ్ళ ముఖాలు వెలవెలబోయాయి. తన చిన్ననాటి రూపలావణ్యాలను గురించి శాస్త్రిగారు సరదాగా చెప్పేవారు.

''కూర్చోండి, వస్తారిప్పుడే... వచ్చే వేళ అయింది'' అన్నది.

సోఫాలో కూర్చున్నాను.

ఆమె లోపలికి వెళ్ళి 'నాన్నగారి స్నేహితులై ఉంటారు.' అంటున్న దెవరితోనో.

ఒక మెరుపు తీగ లాంటి పిల్ల టెన్నిస్ రాకెట్‌తో వచ్చి లోపలికి వెళ్లింది. ఆ తర్వాత బరువైన ఎంసెట్ పుస్తకాలతో పద్దెనిమిదేళ్ళ కుర్రవాడొకడు లోపలికి వెళ్లాడు. టైగర్ గుమ్మం పక్కనే పడుకుని చూస్తున్నది.

నేను కళ్లు మూసుకున్నాను కాస్సేపు.

ఎదురుగా గోడ గడియారం సంగీతం పాడుతూ ఎనిమిది గంటలు చూపుతున్నది. నేను కళ్ళు తెరిచి టీపాయ్ మీద ఉన్న పత్రికలు తిరగేయడం ప్రారంభించాను. రామేశం ఏ సినిమాకయినా వెళ్లాడేమో! ఎప్పటికి వొస్తాడో...!

ఆమె ముందు హాల్లోకి ''రోజూ ఈ పాటికి వచ్చే వారేనండీ. ఇవాళ ఎందు కాలస్యం అయిందో మరి.'' అన్నది.

తర్వాత మంచినీళ్ళు తెప్పించింది. నన్ను గురించి వాకబు చేసి వివరాలు తెలుసుకున్నది.

అప్పుడు రామేశం వచ్చాడు.

నేను నవ్వుతూ లేచి నిలబడ్డాను. అతడు బాగా లావైనాడు. చెవుల దగ్గర చెంపలు తెల్లబడ్డాయి. నావంక పరకాయించి చూసి గుర్తు పట్టి, పెద్దగా నవ్వుతూ చేయి పట్టి లాగి కౌగిలించుకున్నాడు.

''ఎన్నేళ్ళకు... ఎన్నేళ్ళకు కనిపించావు..'' అని ఆశ్చర్యపోయాడు.

''నువ్వు... ఇవ్వాళ ఎక్కడికీ వెళ్లడానికి వీల్లేదు...!''

అంటూ ఆమెవైపు తిరిగి ''శారదా! ఈ పూట మనింట్లోనే ఉంటాడు'' అని హడావిడి చేసి, పిల్లలను పిలిచి పరిచయం చేశాడు.

నేను చివరకు 'రామేశం! నేను అర్జంటుగా వెళ్లాలి. మరోసారి వస్తాన్లే...!'' అన్నాను.

అతడు శాంతించి ''అర్జంటా అయితే సరే... మళ్ళీ ఎప్పుడొస్తావు'' అని అడిగాడు.

''ఒస్తానొస్తాను'' అన్నాను నేను.

ఆ తర్వాత ''ఒక్కసారి ఇలారా... ఒక్క క్షణం... నీతో మాట్లాడాలి'' అన్నాను.

''ఏమిటేమిటి'' అంటూ అతడు దగ్గరగా వచ్చాడు.

ఆమె ఏమనుకున్నదో ఏమో లోపలికి వెళ్లిపోయింది.

''రామేశం! నాకు అర్జంటుగా ఒక సమాచారం కావాలి.''

''ఏమిటది'' అన్నాడతను ఆశ్చర్యంగా.

''ఏమిటంటే... ఏమిటంటే... ఇంగువ ఉంది చూడు... మామూలుగా వంటల్లో వాడుకునే ఇంగువ... అది ఏమిటి అదేమైనా రసాయనిక పదార్థమా లేక రాయి వంటిదా ఉప్పులాగా దొరికేదా లేక మరోటా ఆ వివరం చెప్పు...!''

అతడు నివ్వెరపోయాడు. ఆ తర్వాత అదోక రకంగా చూస్తూ 'అదా నీక్కావలసిన అర్జంటు సమాచారం' అన్నాడు.

ఆ తర్వాత నవ్వుతూ తీరిగ్గా కూర్చోబెట్టి, తనూ కూర్చుని రెండు నిముషాల పాటు వివరం అంతా చెప్పాడు

ఆ తర్వాత ఏదో అనుమానం వచ్చిన వాడిలా చూస్తూ ''ఈ చిన్న విషయం కోసం ఎందుకంత తాపత్రయ పడుతున్నావు'' అని అడిగాడు.

''ఏమి లేదులే... నేను వెళ్ళొస్తాను'' అంటూ లేచాను హడావిడిగా.

అతడు ''ఊళ్లో ఉంటే రేపు తప్పక రావాలి సుమా!'' అన్నాడు వెనక నుంచి.

నేను పరుగులాంటి నడకతో రోడ్డు మీదికి వచ్చి కనబడిన రిక్షా ఎక్కి, పది హేను నిముషాల్లో రాజశేఖరం ఇంటికి చేరుకున్నాను.

రిక్షా వాడికి డబ్బులిచ్చి లోపలికి నడుస్తూ ముందుకు చూశాను. పంచలో ఒకవైపున 'శవం' తల కింద దీపం... సన్నగా ఆడాళ్ళ ఏడుపులు... పక్కన అయిదారుగురు ఏదో మాట్లాడుకుంటూ...

రాముడు నా దగ్గరగా వచ్చి ''ఇందాకే... మీరటు వెళ్లారా ఆ తర్వాత కొద్ది నిముషాలకు కళ్లు తెరిచాడు. ఎవరినో వెతుకుతున్నట్టు చుట్టూ చూశాడు. రెండుసార్లు తల ఎగరేశాడు.. అంతే... అంతా అయిపోయింది'' అంటున్నాడు.

నాకు కాళ్లు వణికాయి. పంచలో చివరగా కూలబడ్డాను.